సమాచారం

నేడు సంస్కృతి టౌన్‌షిప్‌లో లోహ్రీ వేడుకలు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో లోహ్రీ వేడుకలను శనివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా టౌన్‌షిప్‌లోని కల్యాణ వేదిక వద్ద ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఆహ్లాదకరమైన కార్యక్రమాల సమాహారంగా జరిగే ఈ వేడుకల్లో టౌన్‌షిప్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

గాలి పటాలను జాగ్రత్తగా ఎగర వేయాలి

- మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ హరీష్



సాక్షి,మేడ్చల్ జిల్లా: సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో నిత్యం కాంతులు విరిసిల్లాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీష్ ఆకాంక్షించారు. అలాగే గాలిపటాలు ఎగర వేసే సయమంలో జాగ్రత్తలు పాటిస్తూ.. ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి ప్రతీ ఒక్కరి జీవితంలో నూతన కాంతి తీసుకురావటంతో పాటు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన ఆకాంక్షించారు.

క్లుప్తంగా

కేలండర్ ఆవిష్కరణ



కీసర: కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023కి సంబంధించిన కేలండర్‌ను శుక్రవారం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి డైరెక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు మాలోత్ ధర్మ, కందాడి పోచిరెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, మాచ్చాని మల్లేష్, మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, కొకుట్ల చిన్న అంజిరెడ్డి, సీఈఓ కృష్ణారెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీల్లో భాగంగా కొర్రెముల్ సర్వీస్ రోడ్డు వద్ద యంనంపేట్‌లో సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నంబర్ ప్లేట్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు. – ఘట్‌కేసర్

నేటితో ముగియనున్న ధనుర్మాస పూజలు



ఎదులాబాద్ శ్రీగోదాదేవి పూజల్లో భక్తులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీగోదా సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో నేటి(శనివారం)తో ధనుర్మాస పూజలు ముగియనున్నాయి. శనివారం ఉదయం 5 గంటలకు చివరి తిరుప్పావై వినిపించనున్నట్లు పురోహితులు పేర్కొన్నారు. శుక్రవారం భాజాభజంత్రీల నడుమ అమ్మవారికి భక్తులు పూలు, పండ్లు, ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురుషోత్తమాచార్యులు, అనంతసేనాచార్యులు, పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవత్సాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో సీఐ రఘువీర్‌రెడ్డి

కీసర: సంక్రాంతి సందర్భంగా తమ స్వస్థలాలకు వెళ్లే వారు ఇళ్లల్లో విలువైన వస్తువులు, నగదును బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని కీసర సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, ఎస్‌ఐ జగన్‌రెడ్డి, కౌన్సిలర్లు బిజ్జశ్రీనివాస్, సుమిత్రసురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కీసర: నాగారం మున్సిపాలిటీ మానస ఓల్డేజ్ హోమ్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఉంటున్న వృద్ధులకు శుక్రవారం నాగారం మున్సిపాలిటీకి చెందిన కొకుట్ల నర్సింహా రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కొకుట్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొకుట్ల మమత, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో ఆదాయం పెంపే లక్ష్యంగా..

- నగరానికి సమాంతరంగా శివారు పురపాలికల్లో వసతుల కల్పనకు చర్యలు
- పురపాలికల్లో ఆదాయానికి గండి కొడుతున్న ఉద్యోగులపై చర్యలకు రెడీ
- ట్రేడ్ లైసెన్సు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై కార్యాచరణ
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని పురపాలికల్లో కదలిక

సాక్షి,మేడ్చల్ జిల్లా: శివారు పురపాలికల్లో ఆదాయం పెంపు ద్వారా పట్టణ వాసులకు మహానగరానికి సమాంతరంగా మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. ప్రజలపై భారం పడకుండా.. ఆదాయ వనరుల సమీకరణే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పురపాలికల్లో సంపద బృహత్తర వనాలను పెంచడం వంటి పలు కార్యక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న అధికార గణం ట్రేడ్ లైసెన్సు, ఖాళీల స్థలాల పన్ను(వేకెంట్ టాక్స్)లపై కార్యాచరణకు సిద్ధమవుతోంది. గ్రేటర్ శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిల పరిధిలోని 28 పురపాలక సంఘాల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి అన్ని రకాల వనరులను వినియోగించుకోవాల్సి ఉన్నప్పటికీ దానికి కొందరు ఉద్యోగులు గండి కొట్టేలా వ్యవహరిస్తున్న తీరుపై కన్నెసిన యంత్రాంగం శాఖ పరమైన క్రమ శిక్షణ చర్యలకు ఉపక్రమిస్తోంది. పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటే అనుమతులు, ఇంటి, నల్లా పన్నుల మదింపు వంటివి చేస్తుండటంతో పాటు వాణిజ్య, వ్యాపార సంస్థల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడం తప్పనిసరి చేశారు. అయితే ట్రేడ్ లైసెన్సు జారీలో పలువురు ఉద్యోగులు చేతి వాటం ప్రదర్శించడంతో లక్ష్యానికి తగ్గట్టుగా ఆదాయం రావడం లేదు. అదేవిధంగా ఖాళీ స్థలాల పన్ను విధింపుతో కొంత మేరలో ఆదాయం వనరులను పెంచవచ్చునని అధికార యంత్రాంగం యోచిస్తోంది.

ఫీజుతో పాటు అదనంగా...

గ్రేటర్ శివారులో 28 పురపాలక సంఘాల పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆస్పత్రులు, ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ అవసరముంటుంది. వీరంతా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కాని నగర శివారు పరిధిలో పదుల సంఖ్యలో మాంసం దుకాణాలు ఉండగా పొడువు, వెడల్పు కొలతలు లేకుండానే రూ.1000 చొప్పున నిర్ణయించి అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత మాంసం దుకాణాదారులు పేర్కొంటున్నారు. ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల ట్రేడ్ లైసెన్సుల జారీలో కూడా ఇదే తరహా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సు జారీ ఇలా..

నగర శివారుల్లో వ్యాపారం నిర్వహించాలంటే పురపాలక సంఘం నుంచి రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలి. రుసుము విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరుకు నిల్వ చేసే హోల్‌సేల్ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కొందరు రుసుం తక్కువ ఉన్న సమయంలో లైసెన్సు పొంది తిరిగి పునరుద్ధరించడం లేదు.

మచ్చుకు కొన్ని..

బోడుప్పల్‌లో 2035 వ్యాపార సముదాయాలు ఉండగా.. ట్రేడ్ లైసెన్సులు 455 వాటికి మాత్రమే ఉన్నాయి. నిజాంపేటలో 4354కు గాను 2135, జవహర్‌నగర్‌లో 750 గాను 282, దుండిగల్‌లో 1248 గాను 432, కొంపెల్లిలో 1047 గాను 256, నాగారంలో 1211 గాను 265, పోచారంలో 411 వ్యాపార సముదాయాలకు గాను 173 వాటికి మాత్రమే ట్రేడ్ లైసెన్సులు జారీ చేశారు. ఈ 7 పురపాలక సంఘాల్లో మొత్తంగా 11,056 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు ,మున్సిపల్ ఉద్యోగులు గుర్తించినప్పటికిని, ట్రేడ్ లైసెన్సులు 3,998 మాత్రమే జారీ చేశారు. గుర్తించిన వాటిల్లో కూడా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు ఇవ్వలేదు. దీంతో పురపాలికల్లో ట్రేడ్ లైసెన్సుల జారీ విధానం ఏలా ఉందో అర్థమవుతోంది.



బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం

మిగిలిన 21 పురపాలక సంఘాల్లో కూడా...

ఇదే పరిస్థితి మిగిలిన 21 పురపాలక సంఘాల్లో కూడా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్ప మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలకు సిద్ధం కావాలని యోచిస్తోంది.

ఖాళీ స్థలాల పన్ను...

నగర శివారు పురపాలికల్లో ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలాల ప్లాట్లు కోకొల్లల్లుగా ఉన్నాయి. వీటిని సంబంధిత యాజమానులు, పురపాలక సంఘాలు పట్టించుకొనకపోవడంపై.. అవి చెట్ల పొదలు, చెత్తాచెదారం, మురికి నీరుతో నిండి పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో సమీపంలోని బస్తీ, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది భరించలేక.. ఓనర్లు ఎవ్వరో తెలియక పురపాలికల్లో ఫిర్యాదు చేసినా.. పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఖాళీ స్థలాలపై పన్ను మదింపుతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు ఆదాయం పెంచుకోవచ్చునని భావిస్తున్నారు. ప్లాట్లపై యాజమానులకు బాధ్యతను గుర్తు చేయడం ద్వారా పరిశుభ్రతపై అవగాహన పెంచవచ్చునని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

బీజేపీలో చేరికలు



ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన వార్డు సభ్యులు, నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని బీజేపీ ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ నివాసంలో శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళియాదవ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన ఐదుగురు బీఆర్‌ఎస్ పార్టీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ వార్డు సభ్యులతో పాటు పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈటల నివాసానికి తరలివచ్చి ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు నరసింహరావు, ప్రధానకార్యదర్శి సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఘనాపూర్ గ్రామ పరిధిలో గల క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు గణపతి శివశర్మ ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. వేడుకలో ఆలయ అనువంశిక వ్యవస్థాపక ధర్మకర్తలు బాకరాజు సుదర్శన్‌రావు కుటుంబీకులతో పాటు రాజబొల్లారం గ్రామ ఉపసర్పంచ్ నారాయణగౌడ్ దంపతులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు.

ఘనాపూర్ కాంగ్రెస్ శాఖ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న హరివర్ధన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో స్థానిక కాంగ్రెస్ శాఖ నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి హాజరై బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు మమత, రూప్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, నరేందర్, లక్ష్మయ్యగౌడ్, నర్సింహ, భాస్కర్, సురేశ్, శివాజీ, శంకర్‌గౌడ్, కేశవనాథంగౌడ్, మల్లేశ్‌గౌడ్, అభిషేక్‌గౌడ్, మిత్రారెడ్డి, వికాస్‌గౌడ్, అభిలాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

'పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు'



సమావేశంలో మాట్లాడుతున్న ఖలీద్

ఘట్‌కేసర్: బూత్ స్థాయిలో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఖలీద్ అన్నారు. చౌదరిగూడలో యూత్, బూత్ జోడో కార్యక్రమాల్లో భాగంగా యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ వినోద్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది ఖాయమని, యువజన నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తరుణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అభిలాశ్, ఉపాధ్యక్షుడు రాహుల్‌యాదవ్, రమేశ్, మహేశ్, క్రాంతి, వంశీ, పవన్, శివ, నాగరాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శామీర్‌పేట్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. మండల పరిధి మజీద్‌పూర్ వద్ద బావర్చి హోటల్ ఎదురుగా ఈ నెల 10వ తేదీన అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో 60 ఏళ్ల వయస్సు గల భిక్షాటన చేసే వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా కరీంనగర్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నించిన దుండగుల అరెస్టు

జవహర్‌నగర్: ఓ మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ మారుతీనగర్‌లో నివసించే పుష్ప(36) కిరాణా షాపు నిర్వహిస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆమె భర్త షాప్‌కు రావడంతో ఆమె ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో దుండగులు బైక్‌పై వచ్చి పుష్ప మెడలో నుంచి గొలుసును లాగే ప్రయత్నం చేయడంతో పుష్ప కేకలు వేస్తూ ప్రతిఘటించింది. వెంటనే చైన్‌ను వదిలేసి దుండగులు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించి గంటలోపే నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని నిందితులను విచారిస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎంపీ రేవంత్‌రెడ్డితో మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంకు చెందిన కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో అసంపూర్తిగా ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణంను పూర్తి చేయించాలని, అదేవిధంగా వినాయక్‌నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంకు నిధులు విడుదల చేయాలని ఆయన్ను వారు కోరారు. నాయకులు మల్లేష్‌గౌడ్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు సరితా మల్లేష్‌గౌడ్, చాపరాజు, నాయకులు పోచయ్య, సుదర్శన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులతో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఉన్నారు. నిధుల కోసం ఎంపీని కలిశామని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తెలిపారు.

వైభవంగా గోదా దేవి కల్యాణం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మేడ్చల్: ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండలంలోని గౌడవెల్లి గ్రామంలోని రామానుజ ఆలయంలో గోదాదేవి కల్యాణంను వేదపండితులు శాస్త్రోక్తంగా శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో నెల రోజులుగా శ్రీవతం ఆచరించి తిరుప్పావై ఆచరించారు. కల్యాణం సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి ,సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఇంటర్నెట్ సేవలు



సమావేశంలో కేబుల్ ఆపరేటర్లు

శామీర్‌పేట్: గ్రామీణ ప్రాంతాలకు బీఎస్‌ఎన్‌ఎల్ ఫైబర్ కేబుల్ ద్వారా ఇంటర్నెట్, వాయిస్ సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ రంగారెడ్డి జిల్లా డీజీఎమ్ జితేందర్ సింగ్ తెలిపారు. శామీర్‌పేట్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో శుక్రవారం శామీర్‌పేట్ మండలానికి చెందిన కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. మార్చి 31లోపు ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకునే కస్టమర్లకు ఉచిత వైఫై మోడమ్, ఉచిత ఇన్స్టాలేషన్ ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సురేందర్, శ్రీనివాస్, సంతోష్, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కీసర: నాగారం మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌అన్నారు. శుక్రవారం 13వ వార్డు పరిధిలో కొనసాగుతున్న సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు.



సీఎం సహాయనిధి పేదల పాలిట వరం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



కృష్ణగౌడ్‌కు చెక్కు అందజేస్తున్న మంత్రి



అత్వెల్లికి చెందిన ఎం.శ్రీనివాస్‌కు చెక్కు ఇస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లికి చెందిన ఎం.శ్రీనివాస్ అనే డయాలసిస్ రోగికి సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష మంజూరీ కావడంతో ఆ చెక్కును మంత్రి ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో మండల మాజీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు, బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌భాను తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్‌కు చెందిన వ్యక్తికి...

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 9వ డివిజన్ సంతోష్‌నగర్‌కు చెందిన కృష్ణగౌడ్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం కార్పొరేటర్ శారదామనోధర్ రెడ్డితో కలిసి మంత్రి మల్లారెడ్డి అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లపు రవి, కుతాడి సాయికుమార్, నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లి లబ్ధిదారులకు...

కీసర: అంకిరెడ్డిపల్లికి చెందిన కొల్మారి మహేశ్వరికి రూ 40వేలు, కొల్మురి శివలీలకు రూ 35 వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారులకు మంత్రి మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి సింగారం నారాయణ, నాయకులు కొల్మారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపల్లి లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న మంత్రి

అక్రమ నిర్మాణాలపై కొరడా



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝులిపించారు. జవహర్‌నగర్ కమిషనర్ రాజలింగం నేతృత్వంలో శుక్రవారం డీటీఎఫ్ (డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్) టీం మోహన్‌రావుకాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, ఆనంద్‌నగర్, మార్వాడీలైన్‌లలోని పలు అక్రమ బహుళఅంతస్తులను నేలమట్టం చేశారు. కాగా నివాసితులు మాత్రం నిర్మాణాలు కూల్చొద్దంటూ ఆవేదన వ్యక్తం చేసినా అధికారులు తమ పని తాము కానిచ్చుకున్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ టీం అధికారులు శేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, విశ్వనాథ్, స్రవంతి, పాండు, సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు



స్వచ్ఛ సర్వేక్షణ్ గాలిపటాలతో కౌన్సిలర్లు



అవుషాపూర్ మౌంట్ ఫోర్ట్ స్కూల్‌లో..

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట అందమైన ముగ్గులు వేసి అందులో మున్సిపాలిటీలో చేపడుతున్న పనులను వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గుండ్లపోచంపల్లి అనే అక్షరాలు గల గాలిపటాలు చేతిలో పట్టుకుని ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌంట్ ఫోర్ట్ హైస్కూల్లో...

ఘట్‌కేసర్: అవుషాపూర్ మౌంట్ ఫోర్ట్ హైస్కూల్లో సంక్రాతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. బోగి మంటలు, పాలు పొంగించారు. అనంతరం ఆ పాఠశాల హెచ్‌ఎం భాగ్య మాట్లాడుతూ.. హిందు సంస్కృతి, సాంప్రదాయాలు నేటి తరానికి తెలియచేయడానికి ముగ్గుల పోటీలు, భోగి మంటలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను విజయవంతం చేసేందుకు చర్యలు



కంటివెలుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన దృశ్యం

కీసర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగును మండలంలోని వివిధ గ్రామాల్లో విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమంపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జనవరి 18 నుంచి ఏప్రిల్ 13 వరకు గ్రామాల వారీగా నిర్వహించనున్న కంటివెలుగును అర్హత గల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, ఎంపీటీసీ కవిత, మంచాల కిరణ్‌జ్యోతిప్రవీన్, సర్పంచులు విమల, కొకుట్ల గోపాల్‌రెడ్డి, ఎంపీఓ మంగతాయారు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిత రెడ్డి

మేడ్చల్: మండలంలో ఈ నెల 18 నుంచి చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజావిజయానంద్‌రెడ్డిలు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగు అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, ఎంపీఓ వినూత్న, వైద్య సిబ్బంది, సర్పంచ్‌లు, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

ప్రభుత్వం ఈనెల 18వ తేది నుంచి మేడ్చల్ మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫి ఉల్లా, వైస్ చైర్మన్ రమేష్‌లు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కంటి చూపు సమస్యలున్న వారి కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజాప్రతినిధులంతా భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైద్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలిస్తున్న వైస్ చైర్మన్ రమేష్